క్లుప్తంగా

డీవార్మింగ్ డే నిర్వహణపై అవగాహన



దాచేపల్లి : అల్బెండజోల్ మాత్రలు పంపిణీ సమర్థంగా చేపట్టాలని ఎంపీడీవో పప్పుల రత్నం అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా 19 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించి, పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపీడీవో రత్నం మాట్లాడుతూ... పిల్లల్లో మానసిక, శారీరక పెరుగుదలకు అవరోధాలు లేకుండా వికాసాభివృద్ధికి ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఈ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. డాక్టర్లు ఆమూల్య, మధు, ఎంఈఓ పినాకపాణి, పట్టాభి, దేవదాయశాఖ ఈవో నెమలిరెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



విజయపురిసౌత్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నాగార్జునసాగర్, విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ అన్నారు. శుక్రవారం నాగార్జున సాగర్ సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద నో హెల్మెట్.. నో ఎంట్రీ కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పిడుగురాళ్ల: మండలంలోని వీరాపురం, కాంతినగర్, సాంబశివ పేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం రైతు సంఘం, సీఐటీయూ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడీఎస్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు నిరుద్యోగుల కోసం చేసిన సేవలను గుర్తించిన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. టంటం సుబ్బయ్య, తెలకపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



పిడుగురాళ్ల: మాదక ద్రవ్యాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ ఆవరణలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఎంతో మంది జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా విద్యార్థులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోహన్, జూనియరల్ కాలేజీ ప్రిన్సిపల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్స్‌ల్లో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగులు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. శిక్షణ బెంగళూరులో ఇవ్వబడుతుందని, శిక్షణ కాలం 35 రోజులు ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పించబడతాయన్నారు. 35 రోజుల కోర్సులో ట్యాలీ+, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబర్‌లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఏపీ ఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ యూనిట్ ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పోసిపోగు వెంకటరావు, సంయుక్త కార్యదర్శి యుగంధర్, సుశీల, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పంతులునాయక్, వేణుగోపాల్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

భద్రత కరువు..!

- ఏటీఎంల వద్ద కనిపించని సెక్యూరిటీ గార్డులు
- తరుచూ సాంకేతిక సమస్యలతో తిప్పలు



గురజాలలో ఏటీఎం కేంద్రం

గురజాల: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు పట్టణ, గ్రామాల్లో బ్యాంకులు పోటాపోటీగా ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేస్తున్నాయి. గురజాల నియోజకవర్గంలోని ఏటీఎంల నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. నియోజకవర్గంలోని గురజాలలో 7, దాచేపల్లిలో 6, మాచవరంలో 1, పిడుగురాళ్లలో 13 ఏటీఎం కేంద్రాలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. బ్యాంకు అధికారులు ఏర్పాటు చేసిన ఏటీఎంలలో నిత్యం లక్షల రూపాయలు డ్రా చేస్తుంటారు. కేంద్రాల వద్ద గతంలో 24 గంటల పాటు భద్రత నిర్వహిస్తూ సెక్యూరిటీ గార్డులు కనిపంచేవారు. కానీ నేడు మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మిషన్‌లలో డబ్బులు ఏర్పాటుచేసి ఆ తర్వాత వాటి భద్రతను గాలికి వదిలేస్తున్నారని, కనీసం వాటిని పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదని పలువురు అంటున్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత బ్యాంకులపైనే ఉంది. భద్రత ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు హితవు పలుకుతున్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

తరుచూ ఏటీఎం కేంద్రాల్లో మిషన్లు సాంకేతిక సమస్యలతో వినియోగదారులు సతమతమవుతున్నారు. డబ్బులు డ్రా చేయాలన్నా...డబ్బులు అకౌంట్‌లో వేయాలన్నా....సంబంధిత మిషన్ పనిచేయదు. వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకులకు సెలవులు వస్తే మొదటి రెండు రోజులు అందుబాటులో ఉంటాయి. మిగిలిన రెండు రోజులు మాత్రం పనిచేయడం కష్టం. లేదంటే మిషన్‌లో బ్యాలెన్సు నిల్ సమాచారం ఉంటుంది. సంబంధిత అధికారులు ఏటీఎం కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడంతో పాటు వాటి పనితీరును సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

పల్నాటి వీరాచారం పునఃప్రతిష్ట



పునఃప్రతిష్ట చేసుకున్న ఆయుధాలతో పల్నాటి వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం చెన్నకేశవస్వామి సన్నిధిలో వీరాచారులు తమ ఆయుధాలకు శుక్రవారం ప్రాణ ప్రతిష్ట క్రతువులు నిర్వహించారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ప్రత్యేక పూజలు, క్రతువులు నిర్వహించారు. అనంతరం ఆచారం వదలిపెట్టిన వీరాచారులకు తిరిగి పల్నాటి వీరాచారాన్ని పునఃప్రతిష్ట చేశారు. వారి ఆయుధాలకు ప్రాణ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం గండిపాలేనికి చెందిన ఇండ్ల బాలకేశవులు, హరి నారాయణ, బాల చెన్నయ్య, కేశవమూర్తి, బ్రహ్మనాయుడు తదితర కుటుంబాలకు చెందిన వీరాచారులు రణక్షేత్రంలో వారి పల్నాటి వీరాచారాన్ని పునః ప్రతిష్ట చేసుకున్నారు. రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన కొంగ వెంకటేశ్వర్లు, బాలయ్య, సుబ్బయ్య, గోపీ, లక్ష్మీనరసింహ తదితరులు కూడా శుక్రవారం వదలిపెట్టిన పల్నాటి వీరాచారాన్ని చెన్నకేశవస్వామి, అంకాలమ్మలకు ప్రత్యేక పూజల అనంతరం తిరిగి పునఃప్రతిష్ట చేయించుకున్నారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకులు విజయ్‌కుమార్, చెన్నకేశవస్వామి ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండల పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌టీ, హెచ్‌టీ విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాను రెండు గంటల పాటు నిలిపియేయనున్నట్లు పేర్కొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ బి.నాగ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి 60వ కల్యాణోత్సవం సందర్భంగా శనివారం నుంచి 11వ తేదీ వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న జత పళ్ల విభాగం, 9న పాల పళ్లు, నాలుగు పళ్ల విభాగం, 10న సేద్యపు విభాగం, జూనియర్ సైజు, 11న సీనియర్ సైజు, (జాక్‌పాట్) పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

చిట్యాల: ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచవరం మండల కేంద్రానికి చెందిన చెవుల శ్రీనివాస్ (24) అనే యువకుడు రెండేళ్లుగా చిట్యాల మండలం కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. పని నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి మృతిడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి చిన్నమ్మ ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. కాగా యువకుడి తల్లి నాలుగు నెలల క్రితం మృతి చెందినట్లు తెలిసింది.

ఏప్రిల్ వరకు సాగునీరు అందించాలి

పీడీఎఫ్ కన్వీనర్ దర్శి శేషారావు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న శేషారావు

పెదకూరపాడు: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని అమరావతి మేజర్‌కు ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్) కన్వీనర్ దర్శి శేషారావు కోరారు. శుక్రవారం పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మిని కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మేజర్, మైనర్ కాలువల కింద మిరప, పొగాకు, మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలు సాగు చేయటం జరిగిందన్నారు. ఆ పంటలకు నీరు నిరంతరాయంగా ఇవ్వాలని లేనిచో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కాలువలకు నాచు తొలగించి నీరు అందిస్తున్నందుకు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌కు, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమల్ల రమేష్‌కు, డీసీ చైర్మన్ వి.అప్పారావుకు, నాయకులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.మస్తాన్‌రావు, బి.రవి కిరణ్, ఎం.నరసింహారావు, వై.నరేంద్ర, వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయం.. తల్లిదండ్రులకు రిటర్న్ గిఫ్ట్

ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్



ఆయుష్ మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

పెదకూరపాడు : విద్యార్థులు సాధించే విజయం తల్లిదండ్రులకు ఒక రిటర్న్ గిఫ్ట్‌గా ఉండాలని ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ మండలం ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షల పైన అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఎలా చదవాలో సూచనలు.. భయం పోవడానికి తీసుకోవాల్సిన చిట్కాలు వివరించారు. పరీక్షల సమయంలో నిద్ర, తిండి ముఖ్యం అన్నారు. మండల విద్యా శాఖ అధికారి బాలసుందర్‌రావు హేమాద్రి ఆయుర్వేద ఫార్మసీ ఇచ్చిన బ్రైనోవిటా, ఆయుష్ మందులను, వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెద్దబాబు శ్రీనివాస్, ఉషారాణి, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది వెంకటరామయ్య, సునీత, సుశీల, యోగా టీచర్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్



రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్ తదితరులు

సత్తెనపల్లి: మంచి నడవడిక, విలువలతో కూడిన విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ విజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాత రమాబాయి అంబేద్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ వెనక తన శ్రీమతి రమాబాయి అంబేద్కర్ త్యాగం ఎంతో ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ స్త్రీ తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు మాట్లాడారు. ప్రిన్సిపాల్ జాన్సన్ అధ్యక్షత వహించగా ముందుగా మాత రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు, టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ టీవీ సుజాత కుమారి

రెంటచింతల: సమాజంలో ప్రజల రక్షణ కోసం ప్రభుత్వాలు రూపొందించిన వివిధ రకాల చట్టాలపై ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ, బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా 2021 నవంబర్ నుంచి 2022 నవంబర్ 13 వరకు దేశంలోని ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు ఈ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలను మానసికంగా, శారీరకంగా వేధించినా, లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించేందుకు భారత ప్రభుత్వం 2019 సెప్టెంబర్ 20న పోక్సో చట్టం తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, సీనియర్ న్యాయవాదులు ఎస్‌కే బాషా, కలివేల ప్రభుదాసు, సురేష్, సోషల్ వేల్ఫేయర్ ఆఫీసర్ టీవీ సుజాత కుమారి, వార్డెన్లు జె.అరుణకుమారి, నూరెల్లా బేగ్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న భీమా నాయక్

విజయపురి సౌత్: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు బంజారాల రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు ఆర్ భీమా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా భీమా నాయక్ శుక్రవారం విజయపురిసౌత్‌లో మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వమే సేవాలాల్ జయంతి ఉత్సవాలు జరపాలని ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. అత్యధిక జనాభా కలిగిన మాచర్ల నియోజకవర్గంలో మాచర్ల పట్టణం నందు, బంజార భవనంకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బంజారాల ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ జే రాంబాబు నాయక్, రాజ కుమార్ నాయక్, మంత్రు నాయక్, అంజా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్ , శీను నాయక్, గుండ్ల నాయక్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పోలేరమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించిన దేవాలయంలో పోలేరమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8గంటలకు ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, హోమాలు, గర్తన్యాసం, భీజన్యాసం, 11.24 గంటలకు యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ట చేశారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. వేద పండితులు లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో 31 మంది ఋత్వికుల మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం పూర్తిచేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉత్సవమూర్తులను వీధుల్లో ఘనంగా ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతి బిడ్డకు ఉత్తమ పాఠశాల సెయింట్ జోసఫ్స్

- ఘనంగా పాఠశాల వజ్రోత్సవాలు
- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యేలు జూలకంటి, యరపతినేని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు, ఫాదర్లు

రెంటచింతల: ఎంతో వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రెంటచింతల గ్రామంలో ఆర్సీఎం మిషనరీ సంస్థ 1949లో నిర్మించిన సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ప్రతి బిడ్డకు ఒక ఉత్తమ పాఠశాలగా పేరుపొందిందని మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మనందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.

శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, మాట్లాడారు. సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు తిరిగి 75 ఎళ్లకు కలిసి తమ తీపిగుర్తులను నెమరువేసుకోవడం మరుపురాని అనుభూతిని కల్గిస్తుందన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఈ పాఠశాలలో నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎందరో నేడు అత్యున్నత స్థాయికి చేరుకున్న విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుచేసుకున్నారు. విలువలకు, క్రమశిక్షణకు మారుపేరుగా సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలకు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యేలు మాట ఇచ్చారు. ముందుగా ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, శ్రీనివాసరావు, స్కూల్ కరస్పాండెంట్ ఎం.పీటర్ పాపయ్య, విచారణ గురువులు రె. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి, ఫాదర్లు మోపూరి రాయపురెడ్డి, కొమ్మారెడ్డి రఫేల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు నెమరువేసుకున్నారు. సుమారు 600 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని కుశల ప్రశ్నలతో ఆత్మీయంగా పలకరించుకొన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్ఎం దుర్గా ప్రసాద్, ఫాదర్ ఏరువ బాల శౌరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో నేర్పిన విద్యతోనే ఉన్నతస్థాయికి



ఆనాటి ఉపాధ్యాయుల క్రమశిక్షణ, నైతిక విలువలతో నేర్పిన విద్యాబుద్ధులు కారణంగానే శాస్త్రవేత్తగా 28 సంవత్సరాలుగా కొత్త కొత్త వ్యాధులకు మందులను కనుగొంటున్నాను. 1979–80 పాఠశాలలో 10 తరగతి పూర్తిచేశా. ప్రస్తుతం ఇండియా గ్లెకైల్స్ లిమిటెడ్‌కు 11 సంవత్సరాలు వైస్ ప్రెసిడెంట్‌గా సేవలు అందిస్తున్నాను. ఎన్నో ఏళ్ల తర్వాత వజ్రోత్సవాల్లో పాల్గొని, స్నేహితులను కలుసుకున్నాను.

– గోపు బాలశౌరెడ్డి, పూర్వ విద్యార్థి, శాస్త్రవేత్త, తూబాడు

మిత్రులను కలుసుకోవడం సంతోషకరం



సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 1972–79 వరకు విద్య, దేవుని యందు భయభక్తులు, నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్చుకున్నాను. పూర్వమిత్రులను 45 సంవత్సరాల తర్వాత కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాను. ఎంతో సంతోషంగా ఉంది. నాకు ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలతో కూడిన విద్య కారణంగానే ఉన్నత స్థాయికి చేరుకున్నా.

– కంపా అంతోని, విశ్రాంత డీజీఎం, స్టీల్‌ప్లాంట్, కరాలపాడు

జీవితంలో మరుపురాని రోజు



ఆనాటి ఉపాధ్యాయులు అందించిన జ్ఞానంతోనే మధ్య ప్రదేశ్‌కు డీజీపీగా సేవలు అందించే అవకాశం దక్కింది. ఎక్కడో సామాన్య కుటుంబంలో పుట్టి చదువులమ్మ తల్లి సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి వజ్రోత్సవ వేడుకలలో పాల్గొన్నాను. మేధోవికాసం పెంపొందించిన గురువులను, చిన్ననాటి స్నేహితులను కలుసుకొవడంఓ మరుపురాని రోజు.

– బండి మరియకుమార్, విశ్రాంత డీజీపీ, మధ్యప్రదేశ్

ల్యాప్ టాప్, సెల్‌ఫోన్ అప్పగింత

లక్ష్మీపురం: రైలులో చోరీకి గురైన ల్యాప్ టాప్, సెల్ ఫోన్, పర్సును స్వాధీనం బాధితురాలికి జీఆర్పీ పోలీసులు అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. అమరావతి మండలం, అత్తలూరు గ్రామానికి చెందిన కొండవీటి బాలసుష్మ, వైజాగ్‌లో ఇంజినీరింగ్ చేస్తోంది. స్వగ్రామంలో శుభాకార్యం ఉండటంతో వైజాగ్ నుంచి గుంటూరు వరకు రైలు నంబర్ 17244 రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలులో స్లీపర్ క్లాస్‌లో రిజర్వేషన్ చేయించుకుని వస్తోంది. గుంటూరు స్టేషన్‌కు శుక్రవారం తెల్లవారు జామున చేరుకునే క్రమంలో యువతి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, పర్సును సీటులో పెట్టి వాష్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి సీటులో ఉన్న సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, పర్సు కనిపించలేదు. దీంతో బోగిలో వెతుకలాడి తక్షణమే జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి రైలులో చోరీ జరిగినట్లుగా గుర్తించి రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలో వెతుకలాడటం ప్రారంభించారు. అయితే గుంటూరు రైల్వే స్టేషన్‌లోని 6,7 ప్లాట్‌ఫాం మధ్యలోని అండర్ గ్రౌండ్ మెట్ల వద్ద పోలీసులను చూసి చోరీకి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాధితురాలికి సొమ్మును అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి కోసం సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు చెబుతున్నారు.

చేనుకు చీర



గురజాల రూరల్: పంట పొలంలోకి పిట్టలు, కాకులు రాకుండా రైతులు చేనుకు రక్షణగా చీరలను వాడుతున్నారు. చుట్టూ చీరలు కంచెగా ఏర్పాటు చేయడంతో పక్షులు పొలంలో మనుషులు ఉన్నారనే ఆలోచనతో రాకుండా వెళ్తాయని రైతులు చెబుతున్నారు.